
# తలవంపులు అనే సిగ్గు కథ!

– పెయ్యేటి రామలక్ష్మి



తెలుగు కళాసమితి న్యూజెర్సీ కథ

ఆ అమ్మాయీ, ఆ అమ్మాయి తల్లిదండ్రుల పేర్లతో పని లేదు. భారతదేశంలో ఏ మూల చూసినా వాళ్ళు కనిపిస్తారు.

ఆ అమ్మాయికి యుక్త వయస్సొచ్చిందని వేరే చెప్పక్కర్లేదు. వయస్సుతోపాటు అమ్మాయిల్లో కొట్టొచ్చేటట్టు కనిపించే మార్పులు ఆ అమ్మాయిలోనూ చోటుచేసుకున్నాయి. ఆ అమ్మాయి యువతి అయింది. ఆ యువతిని చూస్తున్న యువకులు వెర్రెత్తిపోతున్నారు. సరే! యువతులకు సహజంగా కలిగే ఆశలూ... కోర్కెలూ ఆమెకూ వున్నాయి. ఒక పెద్ద ఉద్యోగి తన భర్త కావాలనీ, తననెంతో అపురూపంగా చూసుకోవాలనీ ఆమె మనస్సు తహతహలాడుతోంది.

ఇప్పుడా యువతిదో అరుదైన రాజ్యం. కలల రాజ్యం.

ఆ కలల్లో ఆమె ఒక రాణి. కాబోయే భర్త ఒక రాజు!! కాబోయే భర్తా... రాబోయే చిన్ని సంసారం ... ఆమె కనే కలల్లో ఎప్పుడూ వుంటున్నాయి.

ఇక ఆ అమ్మాయి తల్లి: కూతుర్ని చూసి మురిసిపోవటల్లేదు. 'గుండెల మీది కుంపటిని ఎలా వదిలించుకోవాలా?' అని చూస్తోంది. ఈ కూతుర్నొదిలించుకుంటే... మరో కూతురు... ఆపై... మరో కూతురు. మొత్తం ముగ్గురు కూతుళ్ళు!! మగపిల్లాడ్ని కనాలనే కలలు కల్లలు కాగా, చివరికి ముగ్గురమ్మాయిల్ని కని ఫుల్‌స్టాప్ పెట్టింది.

ఆ తల్లి...అనుకుంది! – 'లాభం లేదు. కూతురు పెళ్ళి చేసెయ్యాలి. ఏ వయస్సుకు తగ్గ ముచ్చట ఆ వయస్సులో జరగాలి. తనకైతే... ఈ వయస్సుకే ఇద్దరాడపిల్లలు పుట్టేశారు. పూర్వం రోజులు కావు. మన దేశం కట్టుబాట్లు మన మెడలకి గుదిబండలయ్యాయి! ప్రేమ వివాహాలు చాలా అరుదుగా జరుగుతాయి. డేటింగ్ సిస్టమ్ గానీ, ఎవరికి వారు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే పద్ధతిగానీ మన దేశానికింకా రాలేదు. ఏ పనికి పూనుకున్నా ఆడవాళ్ళనే తప్పు పట్టే దేశ సంస్కృతీ... సంప్రదాయం మంటగలుస్తున్నారంటారు. కుల మతాల అడ్డుగోడలు మరింత పెరిగాయి. వాటిలో శాఖోపశాఖలు! వాటి మధ్యే వివాహాలు!! ఇంక ప్రేమ ఎక్కడ ఛస్తుంది? డబ్బుతో ప్రేమల్ని కొలుస్తారు. విలువల్ని కాపాడుకుంటారు. పెళ్ళి చేసుకున్నా మగాడు భార్యని కాదు ప్రేమించేది. ఆమె తెచ్చే కట్నాన్ని ప్రేమిస్తారు. నేడు ఆడపిల్లల పెళ్ళిళ్ళు సామాన్యులకు గగనకుసుమాలు!!

తన యుక్తవయసులో తననీ ఓ మగపురుగు ప్రేమించానంది. తను తెలివిగా 'పెళ్ళి'... అంది! అంతే... కులమతాలూ, కట్న ప్రసక్తులూ లేవనెత్తి ఆ మగపురుగు జారుకుంది. ఇప్పటి కాలం పిల్లలకి ఆపాటి తెలివితేటలుంటాయా?... ఏమో?! పొరబాటున తన కూతురు కాలుజారితే?!...

... ఇంక ఆలోచించలేకపోయిందా తల్లి. భర్తని రోజూ కూతురికి సంబంధాలు వెతకమని వేధించింది.

పాపం! ఆ కూతుర్ని కన్న తండ్రో మధ్య తరగతి కుటుంబీకుడు. చిన్న వయసులోనే చదువుకు స్వస్తి చెప్పి ఇంటి బరువు బాధ్యతల్ని తలకెత్తుకుందుకు ఉద్యోగంలో చేరిపోయాడు. చాలాకాలం తండ్రికి చేదోడుగా వుండి, తోబుట్టువుల్ని చదివించి పెళ్ళిళ్ళు జరిపించాడు. తల్లిదండ్రుల బాధ్యతలూ అప్పులూ తీరేసరికి అతని కూతుళ్లు పెద్దవాళ్లై కూచున్నారు. అతని జీతం ఇంటి ఖర్చులకి సరిపోదు. ఏదో కూతుళ్లని చదివిస్తున్నాడు. 'బి.పి., సుగర్' వ్యాధులు అతనికి తాతలనాటి ఆస్తులుగా సంక్రమించాయి. అతనొక్కడే సంపాదనాపరుడా ఇంటికి. అతను కాస్తా గుటుక్కుమంటే ఆ ఇల్లు రోడ్డున పడుతుంది.

అందుకే ఆ తండ్రి కూతురు పెళ్ళిచెయ్యడానికి అప్పో సప్పో చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. ఊరూరూ ముష్టివాడి. కన్నా హీనంగా, ఎక్కే గుమ్మం దిగే గుమ్మంగా కూతురి వరాన్వేషణలో తిరగడం సాగించాడు.

ఆ తండ్రి ఏడ్చేశాడు – 'హరి దేవుడోయ్?! నా కూతురుకి భర్తెక్కడున్నాడో చూపించరా! చూపించు!! అసలు ,ఈ లోకంలో నా కూతురుకు భర్తని పుట్టించావా? లేదా?! పుట్టిస్తే... వేగిరం నాకు చూపించెయ్యి. నేను తిరగలేను, అని.

చివరికి... ఆ... 'దే–వు – డు –' గాదు, ఆ తండ్రి మొరాలకించి కరుణించాడు.

పాతిక వేల కట్నంతో కూతుర్నింట్లోంచి బైటకి గెంటేశాడా తండ్రి!

పెళ్ళికొడుకు కాళ్లు పోలియో వ్యాధితో జబ్బపడినా ప్రభుత్వంవారిచ్చిన చిన్న గుమాస్తాగిరీ వుంది అతనికి. అది చాలును తన కూతుర్ని పోషించడానికి అనుకున్నాడా తండ్రి. అంతా తన కూతురు అదృష్టమనీ, గత జన్మ సుకృతమనీ ఆ తండ్రి పొంగిపోయాడు.